కొరవడిన 'సంక్షేమం'

- వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- పనిచేయని సీసీ కెమెరాలు బాలికలకు రక్షణ కరువు
- నీటి వసతి లేక కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- దయనీయ పరిస్థితుల్లో వసతి గృహాలు



దొర్నిపాడు: ఎస్సీ బాలుర వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేని దృశ్యం


ఉయ్యాలవాడ: ఎస్సీబాలుర వసతి గృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో వసతి గృహాల పరిస్థితి దయనీయంగా మారింది. సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకచోట నీటి వసతి లేకపోగా మరో చోట కిటికీలకు తలుపులు లేవు. ఇంకో వసతి గృహంలో చాలీచాలని మరుగుదొడ్లు ఉండడంతో బహిర్భూమికి వెళ్లాల్సిన పరిస్థితి. ఇక బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వారికి రక్షణ కరువైంది. కూటమి ప్రభుత్వం వసతి గృహాలపై దృష్టి సారించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.

శిరివెళ్లలో..

మండల కేంద్రం శిరివెళ్లలో కస్తూర్బా స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, యర్రగుంట్లలో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి.

- ఏపీ మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. అది కూడా శిరివెళ్ల–రుద్రవరం గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో ఉంది.
- ఉన్న ఎనిమిది సీసీ కెమెరాలు చాలా రోజుల నుంచి పనిచేయడం లేదు.
- యర్రగుంట్లలోని బీసీ బాలుర వసతి గృహానికి ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నారు.

దొర్నిపాడులో..

- దొర్నిపాడులో ఎస్సీ బాలుర, బీసీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బీసీ బాలికల వసతి గృహం విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో ఆళ్లగడ్డకు తరలిస్తున్నారు.
- ఇక బీసీ బాలుర వసతి గృహంలో ప్రధానంగా ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతింది.
- చాలా కిటికీలకు తులపులు ధ్వంసం కావడంతో పాటు జాలర్ కూడా లేక రాత్రివేళల్లో విద్యార్థులు దోమలు, చలికి ఇబ్బందులు పడుతున్నారు.
- ముఖ్యంగా నీటి సమస్య ఇబ్బందికరంగా ఉంది. ఉన్న నీటి ట్యాంకులు కూడా కారుతుండడంతో హాస్టల్ భవనం పైకప్పు దెబ్బతిని కారుతున్నాయి.

ఉయ్యాలవాడలో..

- మండలంలో ఎపీమోడల్ స్కూల్ హాస్టల్, ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. అలాగే పుచ్చకాయలపల్లెలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉంది.


శిరివెళ్ల ఏపీ మోడల్ స్కూల్ బాలుర వసతి గృహంలో పనిచేయని సీసీ కెమెరా

- ఎస్సీబాలుర వసతి గృహంలో మరుగుదొడ్లకు తులుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తోంది. అలాగే ప్రహరీ గోడా కూడా లేదు.
- బీసీ బాలుర వసతి గృహంలో వసతులు ఉన్నప్పటికీ రాత్రి వేళల్లో నిద్రించేందుకు గదులు ఇరుగ్గా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఇక్కడ మంచినీటి సమస్యను ప్రతి వేసవిలో బాలికలు ఎదుర్కొంటున్నారు.
- స్థానిక మోడల్ స్కూల్‌లోని వసతి గృహానికి సంబంధించి పూర్తిస్థాయిలో ప్రహరీగోడ లేదు. 90 మీటర్లు మేర ప్రహరీ నిర్మిస్తే బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

హాస్టళ్లు.. సమస్యల నిలయాలు


- సంక్షేమ హాస్టళ్లలను వేధిస్తున్న సమస్యలు
- కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు
- ప్రహరీ, బాత్‌రూంలు, నీటి సౌకర్యం లేని వైనం
- మరుగుదొడ్లు శిథిలమవడంతో.. రైల్వే ట్రాక్, ముళ్ల పొదల మధ్యకు బహిర్భూమికి విద్యార్థులు
- సాక్షి విజిట్‌లో వెలుగులోకి సమస్యలు

నంద్యాల: నియోజకవర్గంలోని హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు కరువయ్యాయి. బాత్‌రూములు సరిగ్గా లేవు. ప్రహరీలు లేకపోవడంతో పశువులు, ఇతర వ్యక్తులు హాస్టళ్లలోకి వస్తున్నారు. పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, వసతి గృహాల్లో సోమవారం సాక్షి పరిశీలించగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

- బొమ్మలసత్రంలోని ఎస్సీ హాస్టల్ ముళ్ల పొదల మధ్య ఉంది. ఈ హాస్టల్‌కు ప్రహరీ లేదు. హాస్టల్‌లోకి ఇతరులు ప్రవేశిస్తున్నారు.


ఎస్సీ హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూం

- హాస్టల్‌లోని మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి.
- పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌కు ప్రహరీ లేదు.
- మరుగుదొడ్లకు తలుపులు లేవు.
- వీటికి నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో బహిర్భూమికి ముళ్ల పొదలు, రైల్వే ట్రాక్‌లపైకి వెళ్తున్నారు.
- వర్షా కాలంలో హాస్టల్ చుట్టూ నీరు ఉంటుంది.
- పట్టణంలోని బీసీ హాస్టల్ పూర్తిస్థాయిలో శిథిలమైంది.
- హాస్టల్ గదుల పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో పక్కన అద్దె భవనంలో నడుపుతున్నారు. అద్దె భవనంలో విద్యార్థులకు సౌకర్యాలు లేవు.


ఎస్టీ హాస్టల్‌లోని బాత్‌రూముకు తలుపులు, నీటి వసతి లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు


నంద్యాలలో శిథిలావస్థలో బీసీ హాస్టల్

భయంభయంగా ఉంటున్నాం



మా హాస్టల్ ముళ్ల పొదల మధ్య ఉంది. రాత్రి అయితే భయం భయంగా ఉంటుంది. హాస్టల్‌కు ప్రహరీ కూడా లేదు. హాస్టల్ నుంచి బయటకు వెళ్లాలన్నా విషపురుగుల సంచారం అధికంగా ఉంటుండటంతో ఇబ్బందులు పడుతున్నాం .మరుగుదొడ్లు సక్రమంగా లేవు. ఎప్పుడూ దుర్వాసన వస్తుండటంతో విధి లేని పరిస్థితిలో బహిర్భూమికి బయటకు వెళ్తున్నాం. రాత్రి వేళలో బహిర్భూమికి బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది.

–రాజు, ఎస్సీ హాస్టల్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, నంద్యాల

క్లుప్తంగా

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి


సచివాలయంలో ఎన్‌పీసీఐ లింక్ చేస్తున్న సిబ్బంది

దొర్నిపాడు: ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ కలిగి ఉండాలని పోస్టుమాస్టర్ రామతీర్థ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సచివాలయంలో ఎన్‌పీసీఐ లింక్‌పై అవగాహన కల్పించారు. స్థానిక పోస్టాఫీస్‌లో ఎన్‌పీసీఐ లింక్ చేస్తున్నట్లు చెప్పారు. ఒక వేల బ్యాంకు ఖాతాలు లేకపోతే ఎన్‌పీసీఐ లింక్‌తో ఖాతాలు తెరుస్తామని.. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జున ఉన్నారు.

బాలోత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు సాధించిన గురురాజ విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీల్లో స్థానిక గురురాజ విద్యార్థులు 50 బహుమతులు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ వాసిరెడ్డి విద్యాసాగర్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 15,16,17 తేదీల్లో గుంటూరులోని నంబూర్‌లో వీవీఐటీ బాలోత్సవ్ 2024 ప్రపంచ తెలుగు బాలల పోటీల్లో 850 పాఠశాలల నుంచి 15వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నంద్యాల జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీరామకృష్ణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 12 వయస్సు విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ వయస్సు కేటగిరీలో జిల్లా జట్టుకు నస్రీన్, మోక్షజ్ఞ, చెర్విక్ సింహారెడ్డి, అనిరుద్, శాలినీ, హారిక, షన్ముఖ, నసీబ్, లక్ష్మి, శశిధర్, అర్జిత్ ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ 12వ తేదీన నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రిన్సిపాల్ మునిశేఖర్, టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజారమేష్ చక్రవర్తి, సుజాత, మణికుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు..


ఎంపికైన జీవన్ కృష్ణ

నంద్యాల(న్యూటౌన్): ఏపీ 38వ తైక్వాండో సబ్ జూనియర్ అండర్–25 కేటగిరీలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు రవీంద్ర విద్యాసంస్థల అధినేత రవీంద్ర తెలిపారు. విజయవాడలో జరిగిన ఏపీ 38వ తైక్వాండో సబ్ జూనియర్ అండర్–25 విభాగంలో బంగారు పతకం సాధించిన జీవన్ కృష్ణను అభినందించారు. తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చంద్రమౌళి, హర్షప్రసాద్, వీరస్వామి, వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్‌సలాం పతకం, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ నెల 29వ తేదీన హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు.

పడవ పోటీల్లో విద్యార్థులకు పతకాలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కనోయింగ్, కయాకింగ్ పడవ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆనంద్, అరుణ్‌కుమార్, కేశవకుమార్ మొదటి స్థానంలో నిలిచి పతకం సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి పాల్గొన్నారు.

భాగ్యనగరం విద్యార్థులు భళా


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు: ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్‌లో భాగ్యనగరం ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు ప్రతిభ చూపి భళా అనిపించారు. హ్యాండ్‌బాల్, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారు. సోమవారం హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీ శ్రీధర్, బాలబాలికలను ఆమె అభినందించారు. హ్యాండ్‌బాల్‌లో వరలక్ష్మి, సులోచన, ప్రసన్నకుమార్, కీర్తన, తైక్వాండోలో భవ్యశ్రీ, సోని, మైమూన్, రాముడు, సమీర, సాఫ్ట్‌బాల్ పోటీల్లో సుకన్య, ప్రసన్న కుమార్, ఇర్ఫాన్, టెన్నికాయిట్‌లో అఖిల, హరూన్‌బాషా, లిఖిత, రోప్‌స్కిప్పింగ్‌లో రఫీ, మౌనిక, అరవింద్, ఆసిఫ్, అనూష, త్రోబాల్‌లో హర్షిత్‌కుమార్, వరలక్ష్మి, సుభాష్, సమీరలు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి పతకాలను సాధించారు.

పీఎం విశ్వకర్మ యోజనకు 1,157 మంది అర్హత


కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: హస్త కళాకారులు, చేతివృత్తుల వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈ మేరకు జిల్లాలో నమోదు చేసుకున్న 1,157 దరఖాస్తులను ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన విశ్వకర్మ యోజన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పథకం కింద హస్తకళ కారులు, చేతివృత్తిదారులకు సులభతర రుణాలు మంజూరు చేసి నైపుణ్యం గల శిక్షణ కార్యక్రమాలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల్లోపరిశీలించి జిల్లా కేంద్రానికి ప్రతిపాదించిన 1,157 మంది దరఖాస్తులను ఆమోదించామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జవహర్ బాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీపీఓ జమీవుల్లా పాల్గొన్నారు.

భక్త కనకదాసుకు నివాళి

కన్నడ రచయితగా, సంగీత విద్వాంసుడిగా శ్రీ భక్త కనకదాస గుర్తింపు తెచ్చుకుని తన కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో శ్రీ భక్త కనకదాస జయంతి సందర్భంగా కనకదాసు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, పట్టణ కురవ సంఘ నాయకులు సతీష్ శంకర్, విజయ్ కుమార్, బి.శివప్రసాద్, సుంకా నాగరాజు తదితరులతో కలిసి పుష్పమాల వేసి నివాళులర్పించారు.

మరుగుదొడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టండి

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్షేత్రస్థాయిలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల భవనాల్లో ఉన్న మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అంతకుముందు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ మరుగుదొడ్ల మరమ్మతుల కార్యాచరణ ప్రణాళికలో చేపట్టాల్సిన అంశాలపై వివరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఉయ్యాలవాడ: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంచుకోవచ్చని గ్రంథాలయాధికారిణి సంగీత లక్ష్మి అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు క్రమం తప్పకుండా వెళ్లి ఏ రోజు పాఠాలు ఆ రోజే చదువుకోవాలన్నారు. సెలువు రోజులు, తీరిక సమయాల్లో గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు.

గ్రంథాలయ వారోత్సవాలు

శిరివెళ్ల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతలపై వ్యాసరచన, ఆటల పోటీలు, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయంలో ఎన్నో పుస్తకాలు, రామాయనం, మహాభారం వంటి గ్రంథాలు ఉన్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సుజాత సూచించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, టీచర్లు పాల్గొన్నారు.


శిరివెళ్లలో మ్యూజికల్ చైర్ ఆడుతున్న బాలికలు

విద్యార్థులకు క్రీడా పోటీలు

దొర్నిపాడు: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం గ్రంథాలయాధికారి అఖిలాబేగం బాలికలకు క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ, రోప్ స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ ఆడించారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ ముగింపు రోజున గెలిపొందిన బాలికలకు బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవోలు, సర్క్యులర్లు విడుదల చేయాలని ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, రమణకుమారి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్ల శిబిరాల వద్దకు వచ్చి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని జనసేన, టీడీపీ నాయకులు హామీ ఇచ్చారన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బాలవెంకట్, జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, నంద్యాల సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు గౌస్, లక్ష్మణ్, ఆశా వర్కర్లు నాగేంద్రమ్మ, శివమ్మ పాల్గొన్నారు.


డీఎంఅండ్‌హెచ్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

వన మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే గంగుల


స్వామిని దర్శించుకుంటున్న గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీ నరసింహస్వామివారిని సోమవారం మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకున్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో కొలువైన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజనంలో పాల్గొని భక్తులతో కలిసి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలు అందించారు. ఎంపీపీ గజ్జల రాఘువేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాసారి వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


దీక్షల్లో పాల్గొన్న 108 ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. 108 ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ జీవన్, అధ్యక్షుడు ఎల్లాశేషయ్య మాట్లాడుతూ 108 వ్యవస్థలో రోజుకు మూడు స్విఫ్టులలో 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. మహేష్, సుబానీ, నాగార్జునరెడ్డి, ఓబులేసు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

రుద్రవరం: మండలంలోని రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. గ్రామాల యూనిట్‌గా శనగ పంటకు ఎకరానికి రూ. 84, మండల యూనిట్‌గా జొన్నకు రూ.59, మినుముకు రూ.48, వరికి రూ.126, జిల్లా యూనిట్‌గా వేరుశనగకు రూ.64, ఉల్లికి రూ.90 ప్రకారం ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. వివిధ పంటలకు డిసెంబర్ 15లోపు బీమా చేయించుకోవాలని, వరికి మాత్రం డిసెంబర్ 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వార్డు సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతి పత్రాలు అందజేశారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పట్టణంలో రెండు సెంట్ల స్థలం ఇచ్చి నిర్మాణానికి రూ.5లక్షలు హౌసింగ్ రుణాలు ఇవ్వాలన్నారు. సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, శ్రీనివాసులు ఉన్నారు.

రుద్రవరం: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ ఆళ్లగడ్డ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్, రుద్రవరం మండల కార్యదర్శి బాలనరసింహుడు డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులతో కలిసి సోమవారం రుద్రవరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

గోస్పాడు: అర్హులైన పేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల మంజూరు చేయాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సీపీఐ నాయకులు జిలానీ బాషా కోరారు. సోమవారం స్థానిక సచివాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్తీక దీపం.. కారుణ్య రూపం


ఆళ్లగడ్డ: కాచింతల క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


దొర్నిపాడు: కుందూనదిలో కార్తీక దీపాలను వదులుతున్న మహిళలు

ఆళ్లగడ్డ: శివనామస్మరణతో నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు హోరెత్తాయి. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలాయలు భక్తులతో నిండిపోయాయి. మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. రాత్రి దీపాలు వెలిగించి ముక్కులు చెల్లించుకున్నారు. దీపాల వెలుగుల్లో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. పట్టణ శివారులోని కాచింతల క్షేత్రం, అమృతలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు జమ్మి, ఉసిరిచెట్లకు పూజలు చేశారు.

కార్తీక మాసం పూజలు

ఉయ్యాలవాడ:మండలంలోని కుందూనదిలో మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కార్తీక దీపాలు వెలిగించారు. స్థానిక మారెమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని అర్ధనారీశ్వర అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాకరాజువేముల, దొర్నిపాడు గ్రామాల్లో అన్నదానం చేశారు.

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రథమనంది, సోమనంది, బ్రహ్మనందీశ్వర ఆలయం, నాగనంది, నాగలింగేశ్వరస్వామి, కాళికాంబ చంద్రశేఖర, సంజీవ నగర్ రామాలయం, స్పటిక లింగేశ్వర, తదితర దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రథమనంది ఆలయంలో కేథారేశ్వర నోములు జరిపించారు.


ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వరస్వామి


కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు